హైదరాబాద్ వార్త

'హైదరాబాద్ బుక్ ఫెయిర్' ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

నగరంలోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా పుస్తకావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, బల్మూరి వెంకట్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి,సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ప్రొఫెసర్ రామమేల్కోటే, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, బుక్ ఫెయిర్ అధ్యక్ష కార్యదర్శులు యాకుబ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై "డిసిఎ" కొరడా

-మెడికల్‌షాపులు,

క్లినిక్‌లపై మెరుపు దాడులు

-నాసిరకం మందులు

అమ్ముతున్నవారిపై చర్యలు

-నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే

మెడికల్‌షాపులపై కేసులు

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త: మెడికల్ షాపుల్లో నాసిరకం మందులు, విక్రయాలతోపాటు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లు, మందుల దుకాణాలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ (డిసిఏ) చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా అనుమతి లేని క్లినిక్, మెడికల్ హాల్‌పై డ్రగ్ కంట్రోల్‌బోర్డు అధికారులు దాడులు నిర్వహించి రూ. 35 వేల విలువ చేసే అనుమతి లేని మందుల సీజ్ చేశారు. కుత్బుల్లాపూర్ డ్రగ్ కంట్రోల్ జోన్ పరిధిలో వంపుగూడ బండ మైసమ్మ నగర్ కాప్ర మల్కాజి గిరి మేడ్చల్ జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుంగా క్లినిక్, అనుబంధంగా శ్రీ భవానీ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ నడిపిస్తున్నారు. క్లినిక్‌లో వైద్యుడి స్థానంలో ఒక అమ్మాయి ఉంది, మెడికల్ హాల్ యజమాని లేదు. ఆస్పత్రి మెడికల్ హాల్‌లో తనిఖీలు నిర్వహిస్తే 76 రకాల మందులు రూ. 35 వేల విలువ చేసే మందులు లభించాయి. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. మరో కేసులో కిడ్నిస్టోన్ అనే మందును అనుమతి లేకుండా అమ్మకాలు సాగిస్తున్నారనే డ్రగ్ ఇన్స్పెక్టర్ కె. దేవేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఇలా గ్రేటర్‌లోని మెడికల్ షాపుల యజమానులు,క్లినిక్‌లు, మెడికల్ ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓపక్క మందులదుకాణం, మరోపక్క క్లినిక్‌ను నడిపిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్తే ఖర్చు ఎక్కువందని ఇక్కడికి వచ్చేపేద రోగులను అర్హతలేని వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. అద్దె సర్టిఫికేట్‌లతో లైసెన్స్ తెచ్చుకుని పరిజ్ఞానం లేని వ్యక్తులతో మందులు విక్రయం చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇలాంటి వందలసంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా బస్తీలు,

శివారు ప్రాంతాలలో విచ్చ లవిడిగా నడుస్తున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు అందించాలనే ప్రభుత్వ నిబంధన ఉన్నా దానినెవరూ పట్టించుకోవాడం లేదు. తమకున్న బాధను చెప్పి మందులడిగిన వారికి నకిలీవి అంటగడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. అలాగే జనరిక్ మందులపై సైతం ఎక్కువ ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడున్నారు. అగిడిన వారికి తప్పరశీదులను కూడా ఎవరికీ ఇవ్వడం లేదు. కావున మందులు కొనుగోలు చేసేటువంటి వినియోగదారులు అనుమతి ఉన్నటువంటి ఆస్పత్రులకు వెళ్లాలని అనుమతి ఉన్నటువంటి మందులను చీటీతోనే కొనుగోలు చేయాలని డైరెక్టర్ ఆఫ్ జనరల్ డ్రగ్ అండ్ కంట్రోలర్ కమలాసన్ రెడ్డి తెలిపారు.

చెలామణిలో నకిలీ మందులు..

మెడికల్ షాపుల్లో మార్కెట్ ముందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో నాణ్యతా లోపంతో తయారు చేసిన వివిధ రకాల మందులను అమ్మేహాల్‌సేలర్లు అతితక్కువ ధరపై వీటిని రిటైలర్లకు సరఫరా చేస్తున్నారు. ఈమందుల ధరలు వారికి అసలు ధరకంటే 70శాతం నుంచి 50శాతం వరకు తక్కువతో సరఫరా అవుతాయి. వీటిని బ్రాండెడ్ మందుల ధరతో రోగులకు అంటగడుతున్నారు. ఈమందులనే డాక్టర్లు రాసేలా వారికి నజరానాలు అందిస్తున్నారు. వాస్తవానికి మెడికల్ షాపులకు సరఫరా అయ్యే మందులలో కొన్ని ముఖ్యమైన ముందులు "షెడ్యూల్ హెచ్" హెచ్చరికలతో సరఫరా అవుతాయి. అలాంటి మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి. ఈమేరకు రిజస్టర్ మెయింటెన్ చేస్తే కొనుగోలు చేసిన మందులు ప్రతిరోజూ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రత్యేక రిజిస్టర్లు మెయింటెన్ చేయడంలేదు. కొన్ని మెడికల్‌షాపుల్లో రాత్రి షాపు మూసేముందు కొన్ని మందులకు సంబంధించి బిల్లులుకట్ చేస్తూ నిబంధనల నుంచి తప్పించుకుంటున్నారు.

పేరొకరిది..షాప్ మరొకరిది..

మెడికల్ షాపు ఏర్పాటు చేయాలంటే ఫార్మసీ సర్టిఫికేట్ అవసరం ఉంటుంది. ఆసర్టిఫికేట్ ఆధారంగా అధికారులు లైసెన్స్‌జారీ చేస్తారు. వైద్యం వ్యాపారంగా మారిన క్రమంలో కొంతమంది ఫార్మసీ చేసి ఉన్నత చదువులు చదివేవారికి సంబంధించి ఫార్మసీ సర్టిఫికేట్లను అద్దెరూపేణ తీసుకుని లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్టిఫికేట్‌లో ఉన్న పేరుతోనే లైసెన్స్ మంజూరవుతుంది. సదరు ఫార్మాసిస్టు షాపులో తప్పనిసరిగా ఉండి మందులు విక్రయించాల్సి ఉంటుంది. కానీ నగరంలోని చాలాషాపుల్లో అవగాహన లేని వారితో మందులను విక్రయిస్తున్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల ఏర్పాట్లు పూర్తి

-ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

-హాజరుకానున్న గవర్నర్,సిఎం,మంత్రులు



అత్తాపూర్ డిసెంబరు19,ప్రభాతవార్త : వజ్రోత్సవ ఉత్సవాల కోసం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. విశ్వవిద్యాలయం ఆడిటోరియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లలో డిసెంబర్ 20, 21 తేదీల్లో ఈ వజ్రోత్సవ ఉత్సవాలని ఘనంగా నిర్వహించడానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయ ప్రస్థానాన్ని వివరించారు. 1955 జనవరిలో నాటి హైదరాబాద్ రాష్ట్ర తొలి వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి చొరవతో గొప్ప విద్యావేత్త మరియు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి చేతులమీదుగా 1964 లో రాజేంద్ర నగర్ వద్ద వ్యవసాయ కళాశాల ప్రారంభంతో నాటి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అంకురార్పణ జరిగింది. ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని 1965 సంవత్సరం, మార్చి 20వ తేదీన నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్ర రైతాంగానికి అంకితం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రముఖ ఆర్థికవేత్త, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో 2014 సెప్టెంబర్ 3వ తేదీన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా తెలంగాణ రాష్ట్రంలో తన ప్రాధాన్యాన్ని కొనసాగించింది. విశ్వవిద్యాలయ 60 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలని డిసెంబర్ 20,21 తేదీల్లో పండుగ వాతావరణం లో నిర్వహించడానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. డిసెంబర్ 20వ తేదీ ఉదయం 9 గంటలకు ఉత్సవాల ప్రారంభ సమావేశం ఉంటుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ముఖ్యఅతిథిగా మంత్రులు శ్రీధర్ బాబు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నా రెడ్డి, నీతి ఆయోగ్ సభ్యులు, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ రమేష్ చంద్ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. వీరితోపాటు కోదండ రెడ్డి, మాజీ వ్యవసాయశాఖ మంత్రులు, మాజీ ఉప కులపతులు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, వివిధ అధికారులతో పాటు ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొననున్నట్లు తెలిపారు.

మాదన్నపేటలో భారీ అగ్నిప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సైదాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదన్నపేటలో గల ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం తెల్లవార్ఝామున అకస్మాత్తుగా మంటలు చేలరేగి భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఐఎస్ సదన్ ఎస్‌హెచ్ఓ నాగరాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈదిబజార్‌కు చెందిన ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ మాదన్నపేట ఓల్డ్ ఈద్గా సమీపంలో సూపర్ ఫైన్ ఫ్యాబ్రికేషన్ అండ్ వుడ్ వర్క్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో రోజు మాదిరిగానే దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. కాగా గురువారం తెల్లవారుఝామున ఒక్కసారిగా పెద్ద శబ్ధం వినిపించి దుకాణంలో మంటలు వ్యాపించాయి. సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం కావచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పూజా సామాగ్రి దుకాణంలో మంటలు చెలరేగాయి. దీంతో 4 దుకాణాలకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. పూజా సామాగ్రి దుకాణంతో పాటు ప్లాస్టిక్ దుకాణం మంటల్లో కాలిపోయాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని మార్కెట్ పోలీసులు తెలిపారు.

కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయం..

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త

కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 13 కేజీల 75 గ్రాముల గంజాయి చాక్లెట్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం బాలానగర్ ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి హనుమంతరావు నిందితుడు వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సునీల్ కుమార్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రింగు బస్తీలో గత కొన్ని ఏళ్లుగా కిరాణం షాపు నడుపుతున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని కోరికతో గంజాయి విక్రయించాలనే మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి విక్రయిస్తున్న ముఠాతో పరిచయం ఏర్పరచుకున్నాడు. గత మూడు నెలలుగా గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటి బాలానగర్ పోలీసులు అట్టి కిరాణా షాప్‌పై దాడి చేశారు. ప్రాథమిక విచారణలో గంజాయి చాక్లెట్లుగా గుర్తించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని అతని విచారించగా 65 ప్యాకెట్లు ఉన్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన హరి రామ్ వద్ద కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో పేర్కొన్నాడు. అందులో నాలుగు పాకెట్లు విక్రయించినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న చాక్లెట్లు 13.22 కేజీలు ఉన్నట్లు ఎసిపి హనుమంతరావు తెలిపారు. వాటి విలువ 46వేల 200 రూపాయలు ఉంటుందన్నారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త: పదవ తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్ జిల్లాలోవందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారం సికింద్రాబాద్ మండలంలోని బేగంపేట్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్, పరిసరాలను, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. అనంతరం మూడవ తరగతి క్లాస్ రూమ్ సందర్శించి పిల్లలతో పాఠాలను చదివించారు. మూడవ తరగతి విద్యార్థులు వైష్ణవి, గౌతమ్, నవ్యలతో పాఠాలు చదివించారు. పిల్లలు బాగా చదవడంతో వారిని అభినందించారు. అనంతరం పదవ తరగతి సందర్శించి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం, భయతో పరీక్షలు రాయవద్దని, ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదలతో పరీక్షలు రాసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. రాబోయే మూడు నెలలు విద్యార్థులకు కీలకమని విద్యార్థులు పండుగలు, పెండ్లిలు, ఇతర కారణాలతో పాఠశాలకు గైర్హాజరు అవకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైకష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సరియైన ప్రణాళికతో సిద్ధం కావాలని అన్నారు. పదవ తరగతిలో 90 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత శాతం ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీఈవో, డీఈవో ఉపాధ్యాయులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ ఆర్ రోహిణి, ఈఈ షఫీ మియా, డిప్యూటీ ఈవో శ్రీధర్, డిప్యూటీ ఈఈ సంజీవ్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఏ ఈ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

23న జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మీటింగ్

-రూ.8400 కోట్లతో తాజా ముసాయిదా

-అదనంగా మరో రూ.60 కోట్లు పెంపు

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త: కోటిన్నర మంది జనాభాకు అత్యవసర పౌర సేవలనందించే జీహెచ్ఎంసీ రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన బడ్జెట్ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఈనెల 23న సోమవారం మధ్నాహ్నం 3గంటలకు స్టాండింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించి బడ్జెట్‌పై సభ్యులతో చర్చించనున్నారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం అధికారులు రూ. 8340 కోట్లతో రూపకల్పన చేసిన బడ్జెట్‌పై గత నెలలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయటంతో మరోసారి బడ్జెట్ పై కసరత్తు చేసి, వారి అభిప్రాయాల మేరకు రూ.60 కోట్లను పెంచుతూ, మొత్తం రూ.8400 కోట్లతో బడ్జెట్ లెక్కలను ఖరారు చేసినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్, ట్రేడ్ లైసెన్స్, ఎస్టేట్స్, అడ్వర్ టైజ్ మెంట్ల నుంచి రావాల్సిన ఆదాయాన్ని తక్కువగా కేటాయించారంటూ మజ్లీస్ సభ్యులు అభ్యంతరాలు తెలపటంతో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందలేకపోయింది. అంతేగాక, ఆదాయం పెంచుకునే దిశగా బడ్జెట్ లో ఆదాయ కేటాయింపులు ఉండాలని సభ్యులు సూచించటంతో బల్దియాకు ఆదాయాన్ని సమకూర్చే విభాగాల నుంచి రావాల్సిన ఆదాయాలను స్వల్పంగా పెంచి రూ.8400 కోట్ల రౌండ్ ఫిగర్‌తో బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు సమాచారం. అయితే ఇప్పటికే బడ్జెట్ రూపకల్పన, స్టాండింగ్ కమిటీ ఆమోదం వంటికి పూర్తికావాల్సిన ఉన్నా ..అవి జరగకపోవడంతో అధికారులు, మేయర్‌పై పలువురు కార్పొరేటర్లు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. దీంతో ఈ నెల 23న స్టాండింగ్ కమిటీ స్పెషల్ సమావేశాన్ని నిర్వహించి ఆతంతు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈమీటింగ్‌లో రెవెన్యూ, పెట్టుబడుల ఆదాయ, వ్యయాల్లో మార్పులు చేసి తాజాగా రూపకల్పన చేసిన బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీలో సభ్యులు ఆమోదిస్తారా? మళ్లీ ఏమైనా మార్పులు, చేర్పులు కోరుతూ సమావేశాన్ని వాయిదా వేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

మణికొండ అల్కాపూరికాలనీలో హైడ్రా దూకుడు

- రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ షట్టర్లు నిర్మాణం

- అపార్టుమెంట్ నివాసితుల ఫిర్యాదుతోనే కూల్చివేతలు చేసిన అధికారులు

- ఓ పెద్ద మనిషి ఒత్తిడితోనే కూల్చివేశారంటున్న వ్యాపారులు

- అధికారులతో మహిళలు వాగ్వాదం

అల్కాపూరి కాలనీలో అనుమతి లేని షెటర్లను తొలగిస్తున్న మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు

నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అల్కాపురి టౌన్‌షిప్ అనూహార్ మార్నింగ్ రాగా అపార్టుమెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన నాలుగు వాణిజ్య సముదాయాలను అధికారులు కూల్చి వేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు అధికారులతో వాగ్వాదం చేశారు. అయినా అధికారులు వెనకడుగు వేయకుండా షెటర్లను తొలగించారు. హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు మణికొండ మున్సిపల్ అధికారులు ఈ కూల్చివేతలు చేపట్టారు. ఈ అపార్టుమెంట్ నిర్మాణ సమయంలో బిల్డర్ రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని, ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోర్‌ను వ్యాపార సముదాయాలుగా మార్చాడు. ఈ పరిణామాన్ని అపార్టుమెంట్‌లో ఉన్న 16.ప్లాట్ల యజమానులు ఇది చట్ట విరుద్ధమని, షెటర్లు తొలగించాలని కోరుతూ 3.సంవత్సరాల క్రితమే నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల హైడ్రా అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు రావడంతో 2.వారాల క్రితం స్వయంగా హైడ్రా కమీషనర్ రంగనాథ్ తన సిబ్బందితో వచ్చి నిబంధనలు ఉల్లంఘించి వెలిసిన షెటర్లను పరిశీలించారు. అనంతరం అపార్టుమెంట్ బిల్డర్‌ను, నివాసితులను పిలిపించి నిర్మాణ అనుమతులు పరిశీలించారు. రెసిడెన్షియల్ అపార్టుమెంట్‌లో ఎలివేషన్ కారిడార్లను మూసి బ్యాంకుకు అవసరమైన స్ట్రాంగ్ రూం నిర్మాణం చేయడంతో భవన సామర్థ్యంపై ప్రభావం పడుతుందని, ఇప్పటికే పగుళ్లు వచ్చినట్లు నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కమర్షియల్ షెటర్లు తొలగించాలని మున్సిపల్ కమీషనర్ సదరు బిల్డర్‌కు షోకాజ్ నోటీసులు, డెమాలిషన్‌కు సంబంధించిన నోటీసులు కూడా అందజేశారు. భవన నిర్మాణ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉక్కు పాదం మోపుతామని అధికారులు హెచ్చరించారు. అధికారులు అందజేసిన నోటీసులపై సమాధానం చెప్పకుండా, కమర్షియల్ షెటర్లలో వ్యాపారం చేస్తున్న మహిళలకు సమాచారం ఇవ్వకుండా బిల్డర్ కాలయాపన చేశాడు. దీంతో అధికారులు గురువారం ఉదయం కూల్చివేతలు చేశారు. సంవత్సరాల తరబడి ఇక్కడ తాము వ్యాపారాలు చెల్లిస్తూ, మున్సిపాలిటీకి పన్నులు కూడా చెల్లిస్తున్నామని వ్యాపారస్థులు పేర్కొన్నారు. ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదని, ఓ బడా వ్యక్తి తమ వద్ద డబ్బులు డిమాండ్ చేశాడని, డబ్బులు ఇవ్వకపోవడంతో అధికారులపై ఒత్తిడి పెంచి కూల్చివేతలు చేయించారని వ్యాపారస్థులు ఆరోపించారు. ఈ సందర్భంగా వ్యాపారస్థులు అధికారుల కూల్చివేతలను అడ్డుకున్నారు. పోలీసులు ఆందోళన చేసే వారిని చెదరగొట్టారు. రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ షెటర్లు నిర్మించి, వ్యాపారాలు చేయడం నిబంధనలు ఉల్లంఘించడమే అని, అందుకే కూల్చివేతలు చేశామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో టిపిఓ సంతోష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీతేజ కుటుంబాన్ని పరామర్శించిన పుష్ప డైరెక్టర్ సుకుమార్

-కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ

చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త: సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్ ప్రస్తుతం మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పుష్ప డైరెక్టర్ సుకుమార్ ఆసుపత్రికి వెళ్లి శ్రీతేజను పరామర్శించారు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రేవతి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. డిసెంబర్ 9న శ్రీతేజ్ తండ్రికి డైరెక్టర్ సుకుమార్ భార్య రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఇకపోతే బుధవారం పోలీసులు, ప్రభుత్వ అనుమతి తీసుకుని అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ ఆసుపత్రికి వెళ్లి శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఆ కుటుంబాన్ని కలిశారు. రేవతి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.హాస్పిటల్‌లో ఉన్న శ్రీతేజను ఐసీయులో చూశాను, వైద్యులందరితోనూ మాట్లాడాను, రోజురోజుకు రికవరీ అవుతున్నాడని, గత పద్నాలుగు రోజుల్లో ఆఖరి పది రోజుల్లో రికవరీ బాగా కనిపిస్తుందని, కాని కోలుకోవడానికి చాలా సమయం పడుతుందన్నారు. అయితే శ్రీతేజ కోలుకోవడానికి ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం కూడా శ్రీతేజ్ ఆరోగ్యంపై దృష్టిపెట్టి, అతడిని మామూలు స్థితికి తీసుకురావాలని ఎంతో శ్రమిస్తుంది, అందుకు ప్రభుత్వానికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిఎపారు. ప్రస్తుతం శ్రీతేజ్ బేగంపేటలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి వెంటిలెటర్ పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ట్యూబ్ సహాయంతో ఆహారం అందిస్తున్నారు. భవిష్యత్తులో శ్రీతేజకు ఎలాంటి అవసరం వచ్చినా తాను సపోర్టుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇంతకుముందు సుకుమార్ సతీమణి సబిత రెండుసార్లు శ్రీతేజ కుటుంబాన్ని కలిసి, ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే తెలవారితే పుష్ప-2 అల్లు అర్జున్ పుష్ప 2 ప్రీమియర్స్ సందర్భంగా డిసెంబర్ నాల్గవ తేదీన రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్‌కి రావడం, దీంతో అక్కడ ఫ్యాన్స్ పోటెత్తడంతో తొక్కిసలాట రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీతేజ ఱ్ఱ తొక్కిసలాటలో తీవ్ర అస్వస్థతకి గురయ్యాడు. శ్రీతేజ్ 15 రోజులుగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి

ధర్నాలో అభివాదం చేస్తున్న జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ నేతలు

ధర్నాచౌక్, డిసెంబర్ 19, ప్రభాతవార్త: గొల్ల కురుమలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి వారు మాట్లాడుతూ గొల్ల కురుమలకు రెండు లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడుత గొర్రెలు పంపిణీ చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్లే ఈ ప్రభుత్వం కూడా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దశారులు లేకుండా నగదు బదిలీ ద్వారా రెండవ విడత గొర్రెల పంపిణీ చేయాలని, అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పశువైద్యశాలల పనివేళలు ఉదయం ఏడు గంటల నుండి ప్రారంభించేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గొర్రె కురుమలకు న్యాయం చేయాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు కిల్లె గోపాల్, రవీందర్, మేకల కృష్ణయాదవ్, వివిధ వృత్తి సంఘాల నేతలు మల్లేశం, జి.నాగరాజు, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

-డిఎస్డి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్,
ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్

చిక్కడపల్లి డిసెంబర్ 19 (ప్రభాతవార్త):
రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన నిరుపేద బధిరుల విద్యార్థులకు విద్యను అభ్యసించడానికి వీలుగా నగరంలోని మలక్ పెట్ ప్రాంతంలో ఉన్న వికలాంగుల సంక్షేమ భవనం ఆవరణంలో ఇంటర్, డిగ్రీ కళాశాల హాస్టళ్లు ఏర్పాటు చేయాలనీ డెవలప్ మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సినీతా రామచంద్రన్ ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విధంగా హాస్టళ్లు, కళాశాలలు లేకపోవడం వాళ్ళ వీరంతా మధ్యలోనే చదువును మానివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న దివ్యాంగుల రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ పదవులను వికలాంగులనే నియమించాలని డిమాండ్ చేసారు. ఈ విధంగా నియమించడం వల్ల ఆ వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే స్పందించిన సునీతా రామచంద్రం తప్పకుండ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అయ్యప్ప స్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవం

మండల పూజ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటిమేయర్ బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్.

యూసుఫ్‌గూడ, డిసెంబరు 19, ప్రభాతవార్త
బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం సైట్ 2లోని శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవ మండల పూజ మహోత్సవ కార్యక్రమాలు 3రోజుల పాటు జరుగనున్న సందర్భంగా బోరబండ అయ్యప్ప స్వామి ఆలయ కమిటి అధ్యక్షులు జి.లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందుకు గాను గురువారం గ్రేటర్ మాజీ ఉపమేయర్ బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ చేతుల మీదుగా వార్షికోత్సవ మండలపూజ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మానవుల పట్ల ప్రేమానురాగాలు చూపించాలి

జిటియస్ కాలనీ గ్రౌండ్‌లో సెమి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ చిరంజీవులు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 19, ప్రభాతవార్త
తోటి మానవుల పట్ల ప్రేమానురాగాలు దయ,కరుణ చూపించాలని ఏసుక్రీస్తు లోకరక్షకుడిగా ఈ భూమి మీదకు వచ్చారని ప్రముఖ దైవసైవకులు పాస్టర్ ఉపేందర్ అన్నారు. వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని టియస్‌జెన్‌కో జిటియస్ కాలనీ గ్రౌండ్‌లో గురువారం సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎడియి అమృత, డియి అనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా విద్యుత్ శాఖ మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ చిరంజీవులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ లత వినోద్, సిటిఐ చీఫ్ ఇంజనీర్ మురళీ సాగర్, బియి మధుకర్, శ్రీనువాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాస్టర్ ఉపేందర్ మాట్లాడుతూ దైవకుమారుడు ఏసుక్రీస్తు ఈలోకంలో చేసిన అద్భుత కార్యాలను తెలుసుకుని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. మానవులు చేసే పాపాలను క్షమించాడినికే ఏసుక్రీస్తు మానవునిగా జన్మించారన్నారు. అనంతరం క్రిస్మస్ శుభాకంక్షలు తెలియజేశారు. పవర్ ప్రేయర్ క్వాయర్(పాటల) బృందం ఆలపించిన ప్రత్యేక గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త

కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు చేపట్టాలని గురువారం అసెంబ్లీ ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కుకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి వినతి పత్రం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా మూసాపేట్ ఆంజనేయ నగర్ సర్కిల్ వద్ద, వసంత నగర్ గోకుల్ చౌరస్తా నుండి వసంత విహార వరకు మరో ప్లై ఓవర్ నిర్మించాలని కోరారు. క్రీడాకారుల కోసం హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని కేటాయించి స్టేడియం నిర్మించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను అడిగిన అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు జగదీశ్వర్ గౌడ్, జైపాల్ తదితరులు

నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ ప్రతినిధులు

కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

జగద్గిరిగుట్టలో..
జగద్గిరిగుట్ట, డిసెంబర్ 19, ప్రభాతవార్త : అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వాక్యాలను ఉపసంహరించుకోవాలని సిపిఐ,దళిత సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో హోమ్ మంత్రి అమిత్ షా ప్రతిసారి అంబెడ్కర్ పేరు ఎందుకు తీసుకుంటున్నారు, వారికి అంబెడ్కర్ పైన ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని, వెంటనే ఆ వాక్యాలు ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపీ అమిత్ షా చిత్రపటాలను తగలపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ హోమ్ మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను పదులు సార్లు కాదు ప్రతిసారి అంబేద్కర్ గురించి మాట్లాడుతామని, అమిత్ షా తన వాక్యాలను ఉపసంహరించుకోకపోతే భవిషత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి దళిత హక్కుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములు అధ్యక్షతన, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్, శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, దళిత సంఘాల నాయకులు నర్సింహా, సోమన్న, సోమయ్య, సామెల్, బాలాజీ, ఇమామ్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో...
శేరిలింగంపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త : భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు బీజేపి అహంకారాణికి నిదర్శనమని,అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు సయ్యద్ గౌస్, మన్నెపల్లి సాంబశివరావు,డివిజన్ అధ్యక్షులు అలీ, కట్ల శేఖర్‌రెడ్డి, కటికె రాజు, సూరిరాథోడ్, సుధాకర్, కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధు,జెరిపేటి రాజేశ్, రాము గౌడ్, యాదయ్య, అక్బర్,హనీఫ్ ,పద్మారావు, సాధిక్, శివ కుమార్, నర్సింగరావు,మహిళలు పార్వతి,శాంత తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో...
చిక్కడపల్లి డిసెంబరు 19 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అతని పై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ భారీ నిరసన చేపట్టింది అమిత్ షా ఖబడ్దార్ఏ-అంబేద్కర్ జిందాబాద్ రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ కేవీపీఎస్ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గురువారం సుందరయ్య పార్క్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ప్లకార్డులు జెండాలు చేబూని భారీ నిరసన చేపట్టారు కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్ అధ్యక్షత వహించి ఈ కార్యక్రమంలో టి పి ఎస్ కె రాష్ట్ర కన్వీనర్ జి రాములు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ లు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం దశరథ్ బి సుబ్బారావు కేవీపీఎస్ వివిధ ప్రజాసంఘాల నాయకులు కే రమేష్ జి రాములు కృష్ణ ప్రసాద్ శంకర్ ప్రేమ రజిత లక్ష్మి జగదీష్ మల్లేష్ శ్రీరాములు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

లాల్‌దర్వాజ చౌరస్తాలో...
చార్మినార్,డిసెంబరు 19 ప్రభాతవార్త : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ఉద్దేశిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్ అన్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం లాల్‌దర్వాజ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కేంద్ర కేబినెట్ నుంచి అమిత్ షాను వెలంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాన ఎస్సీ,ఎస్టీ ఐక్య వేదిక అధ్యక్షులు బుంగ శివ కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి చంద్రశేఖర్,దినేష్ బిడ్ల,కె.సురేష్ బాబు,దల్లు శివ,శ్రీ కాంత్ కాగడ.జి. నరసింహ, అస్లాం,బిలాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్గీకరణ,క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం : వడ్లమూరి కృష్ణ స్వరూప్

చిక్కడపల్లి డిసెంబర్ 19 (ప్రభాతవార్త) : వర్గీకరణ. క్రిమిలేయర్ కు వ్యతిరేకంగా దోపిడీ పాలకులు పైన పోరాటం చేయకపోతే భవిష్యత్తు లేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. వర్గీకరణ చేపడితే చంద్రబాబు. పవన్ కళ్యాణ్. బీజేపీ విదీతి సర్కార్ పైన తిరుగుబాటు చేస్తామని.. మీ మనువాద పార్టీ లను భూస్థాపితం చేయాలని పిలుపు ఇచ్చారు. గురువారం వర్గీకరణ. క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ గారి ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిధిగా కృష్ణ స్వరూప్ పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం నకు ఆర్టికల్ 341 ,342 కు వ్యతిరేకంగా వర్గీకరణ. క్రిమిలేయర్ మీద ఆగస్టు 1 వ తేదిన సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు పైన పార్లమెంట్ లో చర్చ జరగాలని నరేంద్ర మోడీ బీజేపీ సర్కార్ ను డిమాండ్ చేసారు. జాతీయ ఎస్సీ కమిటీ సలహాలు ఆర్టికల్ (338)లేకుండా రాష్ట్ర లో వర్గీకరణ కోసం ఏక సభ్య కమిషన్ వేసే అధికారం చంద్రబాబు ప్రభుత్వం నకు లేదని, కావున జి. ఓ 86 ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. డాక్టర్. అంబేద్కర్ గారి ఆశయాలు సాధన కోసం.. . మాలమ హానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్. వి. ఎల్. రాజు.ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్. శ్యాం ప్రసన్న కుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధి బోడపాటి రమణ బాబు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేష్.ఉమ్మడి కృష్ణ జిల్లా అధ్యక్షులు పంతగాని సురేష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని.పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఉప్పాడ. రామచంద్రరెడ్డి.రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి గుమ్మడి మహాలక్ష్మి.పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎస్. ఆంజనేయకుమార్. పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు పి. రాజలింగం. అర్చన. ఎస్సీ. ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్. నాయకులు ఎమ్. లావణ్య.లూద్. మేరీ. బడుగు అచ్చరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న డిబిపి జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే సహించేది

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త:
విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు తెలిపారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఓఈఈఈ) పిలుపుమేరకు గురువారం జేఏసీ ఆధ్వర్యంలో మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ ఆఫీస్ ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని కేంద్రం భావిస్తుందని దాన్ని తప్పకుండా అడ్డుకుంటామన్నారు. ఆయా రాష్ట్రాల ఉద్యోగులకు మద్దతుగా తాము ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 14, 15వ తేదీన నాగపూర్ లో జరిగిన అల్ ఇండియా ఎంప్లాయిస్ ఫెడరేషన్ మీటింగ్లో దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో నైనా విద్యుత్ రంగాన్ని ప్రైవేటకరిస్తే ఆ రాష్ట్రాలకు మద్దతుగా అన్నిరాష్ట్రాలు నిలవాలని ఆందోళన కార్యక్రమం చేయాలని నిర్ణయించామని తెలిపారు.

టిజిఎస్‌పిడిసిఎల్ ముందు నిరసన తెలుపుతున్న ఇంజనీర్లు

కన్వీనర్ రత్నాకర్ రావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న 27 లక్షల మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. యుపిలో ఉద్యోగులపై యస్మాప్రకటించినా గాంధీయ మార్గంలో నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు వజీర్, ఈశ్వర్ గౌడ్, నెహ్రూ, నాగ తులసిరాణి, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, జనప్రియ, వేణు, వర ప్రసాద్, బాలకృష్ణ, విద్యాసాగర్, సుధీర్, కిరణ్, బుచ్చయ్య, కైలాస్, అశోక్, కిషోర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

దారిదోపిడీకి పాల్పడిన నిందితులు రిమాండ్‌కి తరలింపు..

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త
చెడు వ్యసనాలకు అలవాటు పడి దారిదోపిడికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బాలనగర్ ఎసిపి హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం చెందిన షేక్ సమీర్ (22) ప్లంబర్ గా పనిచేస్తున్నాడు. నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ (19)లు స్నేహితులు సమీర్ షాపూర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇరువురు కలిసి సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలని ఆలోచనతో దారిదోపిడికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోని ఈనెల 5వ తేదీన చింతల్ పద్మారావు నగర్ ఫేస్ 2కు చెందిన సతీష్ పంజాగుట్ట ఎల్‌ఐసి కార్యాలయంలో పనిచేస్తూ విధులు ముగింపుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బాలానగర్‌లోని ఉషా ప్యాన్ కంపెనీ సమీపంలోకి రాగానే సమీర్, మహమ్మద్ హుస్సేన్‌లు తన ద్విచక్ర వాహనాన్ని సతీష్ నడుపుతున్న ద్విచక్ర వాహనానికి అడ్డుతగిలారు. దీంతో సతీష్ కింద పడిపోవడంతో అతని వద్ద ఉన్న 2సెల్ ఫోన్లుతో పాటు 2.63 గ్రాముల బంగారు గొలుసును దొంగతనం చేసి అక్కడి నుంచి పారిపోయారు. దీంతో మరుసటి రోజు సతీష్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు దర్యాప్తులో భాగంగా సుమారు 50 సీసీ కెమెరాల ఫుటేజ్‌ని పరిశీలించడంతోపాటు కాల్ రికార్డులను సేకరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 2సెల్ ఫోన్లతో పాటు బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని గురువారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కెటిఆర్‌పై కేసులు నమోదు అన్యాయం

: బిఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్

శేరిలింగంపల్లి,డిసెంబర్ 19 ప్రభాతవార్త
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్ మండిపడ్డారు. కేటీఆర్‌పై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని విరుచుకుపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేసుతో హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారన్నారు. అయితే కాంగ్రెస్ సర్కార్ దానిని జీర్ణించుకోలేక లేనిపోనివి సృష్టించి బద్నాం చేసే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అసెంబ్లీ వేదికగా కేటీఆర్ సవాల్ విసిరారని, కాని కాంగ్రెస్ భయపడి చర్చ పెట్టకుండా పారిపోయిందన్నారు. అసెంబ్లీలో చర్చ పెడితే ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తానయన్నారు. ఎక్కడ నిజాలు ప్రజలకు తెలిసిపోయి కాంగ్రెస్ కుట్రలు బయటపడతాయని, అందుకు చర్చ పెట్టకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేటీఆర్‌పై అన్యాయంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించారని, ఇది ముమ్మాటికి కుట్రపూరితమేనని ఆయన విమర్శించారు. ఓఆర్ఆర్‌పై సిట్ విచారణ అంటూ సీయం రేవంత్‌రెడ్డి ప్రకటించటం హాస్పాస్పదంగా ఉందన్నారు. ఔటర్ టెండర్‌ల విషయంలో అవకతవకలు జరగలేదని, చట్ట ప్రకారంగా గత ప్రభుత్వం ముందుకు వెళ్లినట్లుగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ,సీయం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై పోరాడేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్దంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి,తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రానుంది బీఆర్ఎస్ సర్కారేనని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం : నిర్మాత రాంకీ

చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త: మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదపడతాయని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత రాంకీ అన్నారు. రిషి మ్యూజికల్ ఈవెంట్స్ తృతీయ వార్షికోత్సవ వేడుకలు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాంకీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసీ మ్యూజికల్ ఈవెంట్స్ సంస్థ అధ్యక్షురాలు యోగిత అక్కిరాజు మూడు సంవత్సరాల కాలంలోనే అనేకమంది గాయకులను తమ సంస్థ ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో రిషి మ్యూజికల్ ఈ వెంట్ నిర్వహించనున్న ప్రోగ్రాం క్యాలెండర్ ను అతిథుల చేతుల మీదు గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ పిబి గుడూరు శ్రీనివాస్ (యూఎస్ఏ), లిటిల్ మ్యూజిక్ అకాడమీ చైర్మన్ కొమండూరి రామాచారి, ప్రముఖ గాయకుడు త్రినాధరావు, మల్లెల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షురాలు మల్లెల వసుంధర, ప్రముఖ సం ఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత ఇందు నయన, సినీ నేపథ్యగాయని కీర్తి పాల్గొన్నారు.

ప్రముఖ గాయని యోగితా అక్కిరాజు నిర్వహణలో గాయని, గాయకులు ఆల పించిన సినీ గీతాలు అలరించాయి.

స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అవార్డు అందుకున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి దృశ్యం.

నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలో ఉన్న నార్సింగి మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీ అవార్డు వచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ విభాగంలో నార్సింగి మున్సిపాలిటీకి వచ్చిన అవార్డును గురువారం కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఢిల్లీ వేదికపై అందుకున్నారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ గోపాల విజయ్‌బాబు, కౌన్సిలర్లు, అధికారులు కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కార్మికుల సమిష్టి కృషి ఫలితంగానే నార్సింగి మున్సిపాలిటీకి అవార్డు వచ్చిందని వివరించారు. ఈ అవార్డు మన మున్సిపాలిటీ బాధ్యతను మరింత పెంచిందని, శానిటేషన్ విభాగంలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కమీషనర్ స్పష్టం చేశారు. ప్రజలంతా తమ ఇళ్లలోని తడి,పొడి చెత్తను ఆటోల్లోనే వేసి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. చెత్త నుంచి సేంద్రీయ ఎరువును తయారు చేసి మొక్కల పెంపకం దారులకు విక్రయించి మున్సిపల్‌కు ఆదాయంను సమకూర్చ బోతున్నామన్నారు. పచ్చనదం, పరిశుభ్రతలే ఈ అవార్డు వచ్చేందుకు దోహదం చేశాయని కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి వివరించారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు : కమిషనర్

నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త : ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి ఉన్న అర్హుల

అరుదైన డెంటల్ ట్రీట్‌మెంట్ హైదరాబాద్‌లో అందిస్తున్నాం

ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్ లోగోను ఆవిష్కరిస్తున్న బాలివుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషా

ముషీరాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త: విదేశాలలో లభ్యమయ్యే అరుదైన డెంటల్ ట్రీట్‌మెంట్ ఇప్పుడు హైదరాబాద్‌లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని ఓషన్ ఇంటర్‌నేషనల్ డెంటల్ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌లో కాస్మొటిక్ డెంటిస్ట్రీ, టీత్ జ్యూయలరీ ప్రారంభిస్తున్న సందర్భంగా బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషాలతో కలసి ఆయన హాస్పటల్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తమ హాస్పటల్‌లో కాలేజీ స్టూడెంట్స్, మోడల్స్ మరియు సినీతారలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి, రాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ఈ ట్రీట్‌మెంట్స్ ఫిల్మ్‌స్టార్స్‌కు, మోడల్స్‌కు, బిజినెస్ ఐకాన్స్‌కు, పొలిటీషియన్స్‌కు, కాలేజీ ఐకానిక్ యూత్‌కు ఒక ప్రత్యేకమైన వరమని అన్నారు. విదేశాలలో శిక్షణ పొందిన కాస్మోటిక్ డెంటల్ సర్జన్లు మాత్రమే తమ హాస్పటల్‌లో ఈ చికిత్సలు చేస్తారని, త్వరలోనే ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్స్‌ను దేశవ్యాప్తంగా విస్తరింపచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిపిసీ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి పీవిఎస్ వర్మ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి కృషి : రామక్రిష్ణ

6వ వార్డు తిరుమల కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. గురువారం 6వ వార్డు తిరుమల కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామ న్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్ గౌడ్,ప్రతీక్ జైన్, మధు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్

మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదానికి గురైన షాప్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదానికి గురైన బాధితులకు అండగా ఉంటానని,ప్రభుత్వం నుంచి వచ్చేసహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. చలికాలంలో గుర్తు తెలియని వ్యక్తులు మంటలు పెట్టుకోవడంతో అందులోని నిప్పురవ్వలు షాప్‌లపై పడడంతో మంటలు అంటుకొని కొన్ని షాప్‌లు దగ్ధమైయ్యాయి. రాత్రి సమయాలోల అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని, సీసీకెమరాల ఆధారాలతో నిందితులను పట్టుకోవాలని పోలీసులకు సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్,దుకాణాల బాధితులు పాల్గొన్నారు.

దగ్ధమైన దుకాణాలను పరిశీలించిన కార్పోరేటర్ కొంతం దీపిక

మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైన షాప్‌లను గురువారం మోండా డివిజన్ కార్పోరేటర్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన పూర్వ పరాలను అడిగి తెలుసుకున్నారు.

భరత్‌నగర్ వాసులకు అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



స్థానికులుతో మైనంపల్లి హనుమంతరావు

అల్వాల్, డిసెంబరు 19 ప్రభాతవార్త: భరత్‌నగర్ వాసులకు అండగా ఉంటానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. గురువారం అధికారులుతో స్థానికంగా పర్యటించిన ఆయన సమస్యలను బస్తీ వాసులు నుంచి అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మంచినీరు స్థానికుల ఆలయానికి తన సొంత ఖర్చుతో మెట్లు, 20 మంచినీటి కనెక్షన్‌లు ఏర్పాటుకు హమీ జరిగింది. సంవత్సరాలు కాలంగా అపరిష్కృతంగా భరత్‌నగర్ నుంచి వాంభే కాలనీకి 30 ఫీట్లు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రైనేజీ, పారిశుధ్యం మెడికల్ స్టోర్ వద్ద మంచినీటి వాల్వ్ ఏర్పాటుకు సంబంధించి అధికారులుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఇ మహేష్, ఎఇ రవళి నేతలు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు

అల్వాల్, డిసెంబరు 19 ప్రభాతవార్త: అల్వాల్‌లోని చారిత్రాత్మక మైన ఎనిమిది శతాబ్దాలు చరిత్ర కలిగిన గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు నేడు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాలకు నగరం నలు మూలలు నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడం ఆనవాయితీగా సాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు గుండంలో స్నానమచరించి స్వామి వారిని దర్శించుకుని ఆరాత్రి ఆలయ ప్రాంగణంలోనే నిద్రిస్తారు. బ్రహ్మోత్సవాలులో బాగంగా శుక్రవారం ఉదయం ఉత్సవాలకు ఆంకురార్పణ జరుగుతుంది. శనివారం ధ్వజారోహణము, దేవాతా ఆహ్వానం, భేరి పూజ, పల్లకి సేవ ఉంటుంది. ఆదివారం సాయంత్రం గరుడ సేవ అనంతరం ప్రధాన ఘట్టమైన తిరు కళ్యాణోత్సవం ఉంటుంది. సోమవారం ఉదయం, సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవలు, మంగళవారం ఆఖరి రోజు పూర్ణాహుతి, చక్ర స్నానం మద్యాహ్నం అన్న ప్రసాదం సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పరాంకుశం మాధవాచార్యులు, పరాంకుశం కృష్ణమాచార్యులు తెలిపారు.

28, 29, 30తేదీల్లో టిఎస్‌యుటిఎఫ్ విద్యా వైజ్ఞానిక మహాసభలు

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ముషీరాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆరవ ద్వైవార్షిక విద్యా వైజ్ఞానిక మహాసభలు ఈనెల 28, 29, 30 తేదీలలో నల్లగొడలో నిర్వహిస్తున్నామని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి వెల్లడించారు. గురువారం దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మహాసభల గోడప్రతులను ఎమ్మెల్సీ నర్సి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సి రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బలమైన ఉపాధ్యాయ సంఘంగా ఎదిగిందని అభినందించారు. పాలకులు ఎవరైనా రాజీ పడకుండా ఉపాధ్యాయుల పక్షాన నిలబడి పోరాడుతున్న సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆరవ విద్యావైజ్ఞానిక మహాసభలు నల్లగొండలో జరపడం ఆనందంగా ఉందని, తాను ఆహ్వాన సంఘం చైర్మన్‌గా మహాసభలకు ఆతిథ్యం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ 28వ తేదీ ఉదయం 9.30నిమిషాలకు ఉపాధ్యాయుల మహాప్రదర్శనతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, ప్రారంభ సభలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. 29, 30 తేదీలలో ప్రతినిధుల సభ జరుగుతుందని, గత రెండు సంవత్సరాల కాలంలో విద్యారంగంలో నెలకొన్న పరిణామాలు, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి, అవసరమైన తీర్మానాలు, కార్యాచరణను రూపొందించుకుంటామని వివరించారు. 30వ తేదీ రాబోయే రెండు సంవత్సరాలకు గాను నూతన రాష్ట్ర కమిటీని, కుటుంబ సంక్షేమ నిధిని, పాలక వర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ నేతలు టి.లక్ష్మారెడ్డి, ఏ.సింహాచలం, ఎస్.వై. కొండలరావు, వెంకటప్ప, డి.మస్తాన్‌రావు, కే.అశోక్, ఏ.శ్యాం సుందర్, జి.రాజారావు, ఏ.రాములు తదితరులు పాల్గొన్నారు.

కొర్వి క్రిష్ణ స్వామి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : బండ ప్రకాశ్



కొర్వి క్రిష్ణ స్వామికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: హైదరాబాద్ తొలి మేయర్ కొర్వి క్రిష్ణ స్వామి ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడవాలని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ తెలిపారు. కొర్వి క్రిష్ణ స్వామి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొర్వి క్రిష్ణ స్వామి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్, ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు సీతాఫల్ మండి కార్పోరేటర్ సామల హేమతో పాటు కంటోన్మెంట్,సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఐకాన్ ఫ్యూచర్ ఫెస్ట్ 2024 విద్యావిధానానికి శ్రీకారం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

జీడిమెట్ల, డిసెంబర్ 19, ప్రభాతవార్త

టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యూకేజీ ఫ్యూచర్ ఐకాన్స్ ఫెస్ట్ స్పోర్ట్స్ అండ్ లిటరరీ ప్రోగ్రామ్స్ ప్రారంభోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జెమినీ ఎస్.ఎస్ కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి ఆడేశాల మేరకు టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ బచపన్ చింతల్, బచపన్ సూరారం, బచపన్ ఆర్ఆర్ నగర్, టివిఆర్ అపురూప కాలనీ, టివిఆర్ చింతల్, సత్యవాణి విద్యా నికేతన్ స్కూల్స్ నుండి యూకెజి చిన్నారుల ఐకాన్ ఫ్యూచర్ ఫెస్ట్ 2024 విద్యావిధానానికి, నూతన వరవడికి శ్రీకారం చుట్టడానికి రాబోయే తరం చిన్నారులకు ఏమి కావాలి ఎలాంటి విద్యాబోధన అవసరము వాటితో పాటు సాంస్కృతిక సాంప్రదాయ విలువలను నృత్యాల ద్వారా ఆటల పాటల ద్వారా అభివృద్ధి చెందుతాయని భావించి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలు తిలకించిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ యాజమాన్యాన్ని కొనియాడారు. యూకెజి చిన్నారుల చేత చక్కటి నృత్య ప్రదర్శనలు ఆటల లో మెలకువలు తెలియజేసి చిన్నారులకు బోధించే అధ్యాపక బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయర్ ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలి



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి సర్వే నెంబర్ 137,138, 139లో వినాయర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం స్కూల్ చెందిన 38.11 ఎకరాలైతే దీనికి మించి ప్రభుత్వ భూమి, సీలింగ్ ల్యాండ్ ఆక్రమించుకోవడం చట్ట విరుద్ధం అని వెంటనే మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బీజేపీ నేత ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2015లో సర్వే నెంబర్ 186 ప్రభుత్వ భూమి 1.36 ఎకరాలు వినాయర్ విద్యాసంస్థలు ఆక్రమించుకున్నాయని నోటీసులు ఇచ్చిన ఇప్పటివరకు స్వాధీనం చేసుకోలేదన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించడానికి సర్వే చేయాలని అదేవిధంగా నోటీసులు ఇచ్చిన 1.36 ఎకరాల భూమిని తక్షణమే స్వాధీనం చేసుకొని వినాయర్ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాలేజ్ ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములు నిర్ధారణ కోసం సర్వే చేసి, రికార్డులు పరిశీలించాలని భవన నిర్మాణ గ్రామపంచాయతీ, మున్సిపల్, హెచ్‌ఎండిఏ అనుమతులు, కాలేజ్ స్కూల్ వారు చెల్లిస్తున్న పన్నులు పరిశీలించి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.సమావేశంలో అరుణ్‌రావు,ఈశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాధవరావు, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రాజ్ క్లాసిక్ ఫ్రూట్స్ కంపెనీలో హెల్త్ క్యాంప్

జీడిమెట్ల, డిసెంబర్ 19, ప్రభాతవార్త : పారిశ్రామిక వాడలో రాజ్ క్లాసిక్ ఫ్రూట్స్ కంపెనీలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లైఫ్ స్పాన్ హాస్పిటల్ సీఈవో సురేష్ రాజు ఎంబిబిఎస్ స్పెషల్ కేర్, కార్పొరేట్ మార్కెటింగ్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికులకు ఇప్పుడున్న పరిస్థితుల్లో గుండె జబ్బులు, షుగర్ బీపీలు చాలా ఎక్కువ మందికి వస్తున్నాయి కనుక ఎలాజాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ వివరించడం జరిగింది.ఈ సందర్భంగా నాగరాజు లైఫ్ ట్రైం హాస్పిటల్ మా కార్మికులకు స్పెషల్ డిస్కౌంట్ ఇవ్వాలని తక్కువ జీతాలతో కార్మికుల ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో రాజ్ క్లాసిక్ ఎండి రాజు, నాగరాజు, లైఫ్ స్పాన్ సీఈవో సురేష్ రాజు, రమేష్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఐడి కార్డుల పంపిణీ

ఐడెంటిటీ కార్డ్ అందజేస్తున్న శ్రీపాల్ రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త

ప్రొగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పిఆర్‌టియుటిఎస్) బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బాచుపల్లి మండలంలోని ఉపాధ్యాయులకు జెడ్‌పిహెచ్‌ఎస్ నిజాంపేట్ పాఠశాల యందు, పిఆర్‌టియుటిఎస్ బాచుపల్లి మండల శాఖ అధ్యక్షులు పర్వగళ్ల నరసింహులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఐడెంటిటీ కార్డ్స్ అందజేశారు. పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు నింపింది సంఘమేనని, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసి అనేక జీఓ లు తెచ్చింది ఒక్క పిఆర్‌టియు సంఘమేనని మన పిఆర్‌టియు సంఘం బలంగా ఉంటేనే మన విద్యా వ్యవస్థను బలోపేతం చేయగలుగుతామని, మన హక్కులను సాధించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు వై.రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. ఆనంద్ రెడ్డి, బాచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి మాలి ప్రమోద్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు పి శేఖర్, జిల్లా బాధ్యులు చెన్నయ్య, ప్రదీప్ సింగ్, మండల బాధ్యులు సుమతి, వెంకటేశ్వరరావు, శివ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఎన్ఆర్ విజెఐఈటీలో అంతర్జాతీయ సదస్సు

సదస్సులో పాల్గొన్న వక్తలు

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త

ప్రగతినగర్‌లోని విఎన్ఆర విజ్ఞానజ్యోతి ఇనిటిట్యోట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మూడు రోజుల పాటు జరగనునా అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమంది. మైక్రో ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ రంగాలో ఇటీవలి పోకడలు ఇతివృత్తంగా జరుగుతున్న ఈ సదస్సుకి ఐఈఈఈ హైదరాబాద్ విభాగం, మ్యాథ్‌వర్క్స్ సంస్థలు సంకేతిక ప్రాయోజకులుగా వ్యవహరించాయి. ఈ ప్రారంభోత్సవంలో సిలికాన్ ల్యాబ్స్ సంస్థలో ఇంజనీరింగ్ విభాగినికి సీనియర్ సంచాలకులు ఎన్. వెంకటేశ్, ఎన్ఐటీ క్వాలికట్ ఈసిఈ ఆచార్యులు, 2025-26 సంవత్సరానికి గాను ఐఈఈఈ రీజియన్ 10 సంచాలకులుగా ఎన్నికైన డా.ఎస్.ఎమ్ సమీర్ అంతర్జాల వేదికగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో పాల్గొననున్న విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు క్యాంట్యూమ్ కంప్యూటింగ్, 5జి, 6జి సాంకేతికలు వంటి రంగాలను పరిశీలించి, నైపుణ్యం పెంచుకుని, ఆయా రంగాల పురోగతికి దోహదం చేయాలని అతిథులు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సదస్సు ప్రధానాధ్యక్షులు డా.బి.సత్యనారాయణ, డా.వై. పద్మశాయి, డా.వై.విజయలత, డా.క్లిప్ కుస్‌మాల్, దుర్గాప్రసాద్ కోడె, డా.డి.ఎన్.రావు, డా.సి.డి. నాయుడు, డా.బి.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకు సేవా భూషణ్ పురస్కారం

చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త : ఆల్ ద బెస్ట్ ఆర్ట్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా సేవా స్వర్ణ నంది, సేవా భూషణ్, ఉపాధ్యాయ రత్న నేషనల్ అవార్డులను ప్రధానం చేశారు. గురువారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమానికి హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ జి.చంద్రయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డులను ప్రధానం చేశారు.సీనియర్ పొలిటిషన్, సీనియర్ దళిత నాయకుడు, దళితరత్న, సేవ రత్న, దళిత కళ్యాణ వేదిక అధ్యక్షులు రేణిగుంట ఎల్లయ్యకు 2024 సంవత్సరానికి గాను సేవా భూషణ్ పురస్కారాన్ని జస్టిస్ జి చంద్రయ్య రేనికుంట్ల ఎల్లయ్య కు అందజేశారు. ఈ సందర్భంగా రేణిగుంట ఎల్లయ్య మాట్లాడుతూ తమ దళిత కళ్యాణ వేదిక ఆధ్వర్యంలో దేశాంతర, కులాంతర, మతాంతర, వర్ణాంతర, అన్ని కులాల వారికి ఇప్పటి వరకు 5616 వివాహాలు చేసి సమాజంలో తమకంటూ గుర్తింపును తెచ్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఇది కేవలం సమాజంలోని కుల నిర్మూలన అంటరానితనం కుల వివక్ష, వరకట్న నిషేధం రూపుమాపటం కోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.తమ సీవా కారుయక్రమాలను గుర్తించి సేవా భూషణ్ అవార్డును అవార్డ్‌ను తనకు ఆల్ ద బెస్ట్ ఆర్ట్ అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రెన్‌టు విన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫలక్‌నామ ఫ్యాలెస్‌లో డెమక్రటిక్ సంఘ్ చేంజ్ మెకర్ అవార్డుల ప్రధానం చేస్తున్న ఎంపి రేణుక చౌదరి

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడిస్తాం

నినాదాలు చేస్తున్న తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు

ముషీరాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ ఈనెల 20నఛలో అసెంబ్లీ పేరుతో అసెంబ్లీని ముట్టడిస్తామని తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటియూసి), ఎం.ఏ.సలీం, ఎండి నజీర్ (యూటీఏడబ్ల్యూఏ), వి.మారయ్య, ఎస్.రాంకిషన్ (బిఆర్‌టియూ), ఏ.సత్తిరెడ్డి (టిఏడిఎస్), వి.ప్రవీణ్ (టియూసీఐ), సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, మల్లిఖార్జున్(ఏఐటియూసీ), లక్ష్మణ్ (సిఐటియూ) వెల్లడించారు. గురువారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ మానిఫెస్టోలో ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెలలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీతో రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్‌ను కూడా విరమించుకున్నామని గుర్తు చేశారు. ఓలా, రాపిడో బైక్ ట్యాక్సీ మరియు మహాలక్ష్మి పథకంతో బేరాలు లేక ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, కొంతమంది ఆటో డ్రైవర్లు ఆర్థిక బాధలతో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవటంతో తప్పనిసరి పరిస్థితులలో అసెంబ్లీ ముట్టడిస్తున్నామని, పోలీసులు అడ్డుకుని లాఠీలు, తూటాలు ఝుళిపించినా భయపడేది లేదని, అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం సత్యనారాయణరెడ్డి భవన్ నుండి వేలాది మంది ఆటో డ్రైవర్లతో జరగబోయే ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి అభినందనీయం

రైల్వే జిఎంను సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నేతలు శివగోపాల్ మిశ్రా,శంకర్ రావ్, శ్రీనివాస్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబరు 19 ప్రభాతవార్త: భారత రైల్వేలో దేశ వ్యాప్తంగా జరిగిన ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో ఏఐ.ఆర్.ఎఫ్.13 జోన్లలో విజయం సాధించి దేశంలోనే, సికింద్రాబాద్ జోన్‌లో కూడా మజ్దూర్ యూనియన్ అత్యధిక మెజార్టీతోవిజయం సాధించడం అభినందనీయమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఏఐ.ఆర్.ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివకుమార్ మిశ్రా, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావ్‌లు పిలుపునిచ్చారు. రైల్వే గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ నెంబర్-1 స్థానంలో నిలిచి బారీ మెజార్టీతో విజయం సాధించినందుకు గురువారం రైల్వే కేంద్ర కార్యాలయం, సంచాలన్ భవన్, లేఖా భవన్, హైదరాబాద్ భవన్, రైల్ నిలయం వరు బారీ ర్యాలీ మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రైల్వే ఉద్యోగులకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేసేంత వరక ఏఐఆర్ఎఫ్. పోరాడుతుందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం,కార్మికుల హక్కుల సాధన కోసం మజ్దూర్ యూనియన్ నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నేతలు ఉదయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,భరాటే, రామక్రిష్ణ, కోశాధికారి సరోజిని రెడ్డి, మురళీధర్,సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవిందర్, క్రిష్ణ, సంజీవయ్య,బుచ్చిరెడ్డి, మంజూలత, వరప్రసాద్, భాజా బాబా,రైల్వే సీసీ అధ్యక్షుడు చిలుక స్వామి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ రెడ్డి గెలుపుకై కృషి చేస్తాం

వేగవంతంగా అభివృద్ధి పనులు : అబ్రార్

రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

మలక్ పేట, డిసెంబరు 19, ప్రభాతవార్త: వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకులు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్ లోని కట్టెలగూడలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను జీహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్, వర్క్ ఇన్స్పెక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చేంజ్ మేకర్ అవార్డు

తుర్కయంజాల్ డిసెంబర్ 19ప్రభాతవార్త : 2021 నుండి 2024 వరకు స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షన్ లో మెరుగైన ప్రదర్శన, చెత్తతో నూతన వస్తువులు తయారు చేయడం మరియు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ కార్యక్రమాలు ,సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన మున్సిపాలిటీలకు సిఎస్ఈ మరియు ఎంహెచ్ఓయుఎసంయుక్తంగా ఢిల్లీలో డిసెంబర్ 19న సిల్వర్ హోక్ హాల్లో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో డా.సునీత నరైన్(సిఎస్ఈ డైరెక్టర్)చేతుల మీదుగా చేంజ్ మేకర్ అవార్డును తుర్కయంజాల్ పురపాలక సంఘం కమిషనర్ అమరేందర్ రెడ్డి,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ హరీష్ అందుకున్నారు.

బిఎన్ రెడ్డి నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

జిఎచ్ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. డిసెంబరు.19. ప్రభాతవార్త జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్ ని వినతి పత్రం అందజేశారు.అదేవిధంగా హస్తినాపురం నుంచి సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని మరియు బి.యన్.రెడ్డి నగర్ సిగ్నల్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువ ఉన్నందున పాదచారులు నడిచేందుకు ఫుటోవర్ బ్రిడ్జిను ఏర్పాటు చేయాలని కోరారు..సానుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధికి అతి త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కాంట్రాక్టు సిబ్బంది జీతాలు పెంచాలి : మహేష్ కుమార్

కాంట్రాక్ట్ సిబ్బందితో కలిసి వినతిపత్రం అందజేస్తున్న మహేష్ కుమార్ తదితరులు

మలక్ పేట ,డిసెంబర్ 19, ప్రభాతవార్త : సంక్షేమ హాస్టల్స్ లో విధులు నిర్వహించే కాంట్రాక్టు సిబ్బంది జీతాలు వెంటనే పెంచాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ళ మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు కాంట్రాక్ట్ సిబ్బందితో కలిసి సంక్షేమ హాస్టల్స్ డివ్యూటీ డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల హాస్టల్స్ లో విధులు నిర్వహించే కాంట్రాక్టు సిబ్బందికి రూ .5000 నుంచి రూ .పదివేల వేతనం ఇస్తున్నారని, వెంటనే వారి జీతాలను రు.15 వేల నుంచి రూ. 25 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు విధానం తొలగించి పూర్తిస్థాయిలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ డైరెక్టర్ పేర్కొనడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు నిమ్మల సతీష్, కార్యదర్శి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలి : శ్రీనివాస్

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా రాజ్యసభలో మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యాలను నిరసిస్తూ డిఎస్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను బిజెపి అవమానిస్తే దేశ ప్రజలు సహించబోరని అన్నారు. దేశానికి సుస్థిరమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను దేశ మంతా దేవుడిలానే భావిస్తుందని, అలాంటి మహోన్నత వ్యక్తిని అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డాక్టర్ అంబేద్కర్‌కు, రాజ్యాంగానికి బిజెపి వ్యతిరేకమని మరోసారి అమిత్‌షా మాటల ద్వారా నిరూపితమైందని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడికి అంబేద్కర్‌పై ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో గెలుపే లక్ష్యం : తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు జయరాం

మల్కాజిగిరి డిసెంబరు19,ప్రభాతవార్త

తెలంగాణలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు పొగాకు జయరాం పేర్కొన్నారు. గురువారం మిర్జాలగూడలోని ఎన్ఎస్ఏ ఫంక్షన్ హాల్లో టిడిపి, తెలుగు యువత విస్తృత స్థాయి సమావేశంతోపాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం తెలుగు యువత రాష్ట్ర నాయకులు చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మట్లాడుతూ....కార్యకర్తలే ఏ పార్టీకైనా ప్రాణమని, వారు లేకపోతే పార్టీల మనుగడ కష్టమని అన్నారు. కార్యకర్తలు లేకపోతే ఏ పార్టీ ఉండదు. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గాల్లో రాబోవు ముప్పై ఏళ్లల్లో పార్టీలోకి యువతను పెద్దసంఖ్యలో స్వాగతించడంతోపాటు వారిని ప్రోత్సహించాడమే లక్ష్యమన్నారు. చంద్రబాబు నేతృత్వంలో తెలంగాణలో టీడీపీ జెండాను రెపరెపలాడించడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలన్నారు.పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో, ఏడాది కాంగ్రెస్ పాలనతో తెలంగాణలో అభివృద్ధి ఏమి జరగలేదని ఆయన విమర్శించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపిలుగా మల్లారెడ్డి, రేవంత్రెడ్డి, ఈటల రాజేందర్లు గెలువడానికి టిడిపి మద్దతు కూడా కారణమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. పార్టీలో కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా యువత పెద్ద సంఖ్యలో సభ్యత్వాన్ని తీసుకున్నారు .తెలుగు యువత రాష్ట్రేష్ ముదిరాజ్ గారి అద్వర్యం లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ తెలుగు యువత విస్తృతస్థాయి సమీవేశం మరియు నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక మీర్జాలగూడలోని ఎస్ఎస్వ్ గ్రాండ్ ఫంక్షయిన్ లో నిర్వహించడం దేనికి ముఖ్య అధిపతిగా విచ్చేసిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు పోగాకు జైరాం చందర్ గారు మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో సభ్యత్వం తీసుకొని తెలుగు దేశం పార్టీ కి పూర్వ వైభవం తీస్కువోచే విధంగా ముందుకు తీసుకెళ్లాలి అని ఈ సందర్భంగా ముఖ్య అతిధులు కందికంటి అశోక్ గౌడ్,సత్యనారాయణ పితాని, లలిత చౌదరి, విజయనేత, మురళీధర్ రెడ్డి, సుధకర్ రెడ్డి, పాలక శ్రీనివాస్, శ్రీధర్, అలీ, గోపి, రోహిత్, సాయి కిరణ్, భాను, రియాజ్, అనూష మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందర్భంగా బార్‌లకు పోలీసుల అంక్షలు

న్యూ ఇయర్ సందర్భంగా బార్‌లు, వబ్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త : కొత్త సంవత్సరం సందర్భంగా జరిగే వేడుకలలో మైనర్లకు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎసిపి ఎ.చక్రపాణి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాచకొండ సిపి సుధీర్‌బాబు, డిసిపి పద్మజారెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లను డాగ్ స్క్వాడ్ బృందాలతో ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ కోటేశ్వర్‌రావు, మాధవరెడ్డి తదితరులు తనిఖీలు చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎసిపి చక్రపాణి మాట్లాడుతూ మల్కాజిగిరి సబ్ డివిజన్ పరిధిలోని బార్‌లు, రెస్టారెంట్లు, హోటల్స్ విధిగా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. సౌండ్ పోల్యూషన్, పోలీసుల అనుమతి పత్రాలు, జిహెచ్ ఎంసి నుంచి అనుమతి ఉండాలని సూచించారు. కొత్త సంవత్సరం సందర్భంగా మైనర్లకు ప్రవేశం కల్పించవద్దని, నిబంధనలు ఉల్లఘించి వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంకన్ అండ్ డ్రైవ్, త్రిబుల్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపడుతామని తెలిపారు. ఈవెంట్ జరిగే చోట విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పోలీసుల నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లు తనిఖీ చేసిన పోలీసులు

హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సుధీర్ బాబు

ఎల్.బి.నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త: నూతన సంవత్సరం 2025 వేడుకలు, మాదకద్రవ్యాల వ్యతిరేక విధానాన్ని దృష్టిలో పెట్టుకొని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో రాచకొండ పోలీస్ లు బార్ అండ్ రెస్టారెంట్ హోటలను తనిఖీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, డిసిపి ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్ రావు,ఎస్సై సి.వెంకటయ్య, పెట్రోల్ సిబ్బంది, రాచకొండ బృందం డాగ్ స్క్వాడ్ బృందం వైల్డ్ హార్స్ పబ్, సురభి బార్ అండ్ రెస్టారెంట్, ఓవర్ ది ఫ్లో పబ్, కిన్నెర గ్రాండ్ బార్ అండ్ రెస్టారెంట్, ఫ్రోత్ కేఫ్ పబ్‌ను సందర్శించి విస్తృత తనిఖీలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన అధికారులు

తట్టిఅన్నారంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో హౌసింగ్‌బోర్డ్ ఎండీ, అదనపు కలెక్టర్

హయత్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి 13వవార్డు తట్టిఅన్నారం హౌసింగ్‌బోర్డు కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం సాయంత్రం హౌసింగ్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వీపిగౌతమ్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. సర్వేకొనసాగుతున్న విధానాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

రాచకొండ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో నూతనంగా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మేయర్ చిగిరింత పారిజాత రాచకొండ పోలీస్ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆమె గురువారం నేరేడ్‌మెట్‌లోని కమీషనరేట్ కార్యాలయానికి తరలివెళ్ళి అక్కడ కమీషనర్ సుధీర్‌బాబును కలిసి ఇటీవల జరిగిన బడంగ్‌పేట్ మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో పిఎస్ ఏర్పాటు కోసం పాలకవర్గం చేసిన తీర్మాణ ప్రతితో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రజావసరాల నిమిత్తం బడంగ్‌పేట్‌లో కొత్తగా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కమీషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ పాత మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం...

హయత్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: భర్తతో గొడవపడి వేరుగా ఉంటున్న గృహిణి ఇద్దరు పిల్లలతో సహా కన్పించకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి చెందిన మందుల ఏషబ్ భార్య సరిత జూన్‌లో భర్తతో గొడవపడి సోదరి ఇంటికి వెళ్లింది. సోదరి సూచన మేరకు హయత్‌నగర్‌లోని వీరభద్రనగర్ కాలనీలో గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటూ రామోజీ ఫిల్మ్‌సిటీలో షూటింగ్‌వర్క్‌కు వెళ్తోంది. మూడు రోజుల క్రితం వరకు ఆమె సోదరి, ఆమె కుమారుడితో ఫోన్‌లో మాట్లాడింది. ఆతరువాత ఫోన్ లిఫ్ట్‌చేయడంలేదు. ఇంటికి వెళ్లి చూడగా ... ఆమె ఇల్లు కాళీ చేసి వెళ్లిందని యజమాని తెలిపాడు. ఇద్దరు పిల్లలతో వెళ్లిన ఆమె ఆచూకీ కోసం బందువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో సోదరి కుమారుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మాల నేతల ముందస్తు అరెస్టులు

కంచన్‌బాగ్ పిఎస్‌లో అరెస్టు అయిన మాల నాయకులు

సరూర్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో గురువారం పలువురు మాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బాలాపూర్‌కు చెందిన షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు గుండె నాగార్జున బాబును, జిల్లెలగూడకు చెందిన ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కన్వీనర్ ఎంగల యాదగిరిలతో పాటు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని బాలాపూర్, కంచన్‌బాగ్ తదితర పిఎస్‌లకు తరలించి ఆ తర్వాత విడిచిపెట్టారు. అయితే తమవి అక్రమ అరెస్టులంటూ మాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

రామంతాపూర్‌లో రోడ్డు డివైడర్లకు కొత్త అందాలు

ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త : రామంతాపూర్ ప్రధాన రహదారిలోని రోడ్డు డివైడర్లకు జిహెచ్ఎంసి అధికారులు కొత్త అందాలతో తీర్చిదిద్దుతున్నారు. రామంతాపూర్ దూరదర్శన్ నుంచి పెద్ద చెరువు వరకు ఉన్న రోడ్డు డివైడర్ల వెంట జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో రోడ్డు మధ్యలో పూల కుండీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు వెంట డివైడర్ల నిర్మించగా హర్టికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో పూల కుండీలు ఏర్పాటు చేసే పని చేపట్టారు. రోడ్డు మధ్యలో వాహనదారులకు ఇబ్బంది లేకుండా చిన్న చిన్న పూల మొక్కలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటిని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మొక్కలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అల్వాస్‌గూడలో ఏనుగు పద్మమ్మకు ఘన నివాళులు



ఏనుగు పద్మమ్మకు నివాళులర్పిస్తున్న తీగల కృష్ణారెడ్డి, చొప్పరి సుధాకర్‌రెడ్డి, చొప్పరి సంతోష్‌రెడ్డిలు

సరూర్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్వాస్‌గూడ 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి మాతృమూర్తి ఏనుగు పద్మమ్మ దశదిన కార్యక్రమం గురువారం స్థానిక చప్పిడి అడవిరెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, అల్వాస్ గూడ మాజీ సర్పంచ్, నవీన సంస్థల అధిపతి చప్పిడి సుభాన్‌రెడ్డి, గ్రామ మాజీ పోలీస్ పటేల్ చప్పిడి సంతోష్‌రెడ్డిలు పద్మమ్మ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించి ఆమె కుమారులైన కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, ఆయన సోదరులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సామ ప్రభాకర్‌రెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లతో పాటు మాజీ జడ్పీటిసి బంగారు సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామిడి రాంరెడ్డి, ముత్యాల కృష్ణ తదితరులు పద్మమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు.

అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి : మిద్దెల జితేందర్

కాంగ్రెస్ పార్టీ నిరసనలో పాల్గొన్న మిద్దెల జితేందర్

సైదాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ డిమాండ్ చేశారు. ఎల్‌బినగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమిత్‌షా దిష్టిబొమ్మనదగ్ధం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ 140 కోట్ల ప్రజలు దేవుడిలా కొలిచే అంబేద్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యాలు చేయడం దారుణమని అన్నారు. భారత రాజ్యంగం పట్ల, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పట్ల బిజెపి అనుసరిస్తున్న వైఖరిని అమిత్‌షా వ్యాఖ్యాలు స్పష్టం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.అమిత్‌షా వ్యాఖ్యాలను ప్రతి ఒక్కరు ఖండించాలని ఆయన కోరారు. భేషరతుగా అమిత్‌షా తన వ్యాఖ్యాలను వెనక్కి తీసుకుని దేశ ప్రజలకుక్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవు

రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: అభివృద్ధి పనులలో నాణ్యతను పాటించాలని, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తిలేదని ఎక్కడైనా నాణ్యతా లోపాలు కన్పిస్తే కంట్రాక్టరుపై చర్యలకు సిఫారసు చేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ప్రారంభమైన సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్తులో రోడ్లపై నీరు నిలువకుండా లెవెల్స్ పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. అనంతరం డిఫెన్స్‌కాలనీ, మిదాని కాలనీ, మహాగాయత్రినగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్లను వేయాలని కాలనీవాసులు కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... అవసరమైన చోట రోడ్లు వేయడానికి అనువుగా ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ హేమునాయక్, ఆయా కాలనీల ప్రతినిధులు రొయ్యభాస్కర్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, నెహ్రూస్వామి, మల్లికార్జున్, సుబ్బారావు, శేషగిరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి - చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు

సమావేశంలో చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్, కమిషనర్

హయత్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త: పాలకవర్గం పదవీకాలం త్వరలోనే ముగియనుందని.. ఆలోగా కౌన్సిలర్లు ఆయా వార్డులలోని అపరిష్కృత సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో గురువారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... నెలరోజుల్లో మిగిలిన పనులను పూర్తిచేయాలని సూచించారు. అనంతరం అజెండాలోని 25 అంశాలపై కౌన్సిల్ చర్చించి ఆమోదించడం జరిగింది. విజయవాడ జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో పాదచారులు రోడ్డు దాటడం ఇబ్బంది కరంగా మారిందని పసుమాముల రోడ్డుతో పాటు లక్ష్మారెడ్డిపాలెంలోని అంజనేయస్వామి ఆలయం వద్ద లిఫ్టుతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను నిర్మించడానికి నేషనల్ హైవే అధారిటీ ఆఫ్ ఇండియా వారికి ప్రతిపాదనలు పంపించడానికి ఏకగ్రీవంగా తీర్మాణించారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణా విజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాల భైరవ బ్రహ్మోత్సవాలకు కెటిఆర్‌కు ఆహ్వానం

మాజీ మంత్రి కేటిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆలయ కమిటి నేతలు

ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాలభైరవ ఆలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ మాజీ మంత్రి కేటిఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆలయ కమిటి నేతలు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ కాల భైరవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23 తేదిలలో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు మాజీ మంత్రి కేటిఆర్‌తోపాటు, పలువురు ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలకు కేటిఆర్,ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరుపుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద